సాక్షి పెద్దపల్లి

సోమవారం ¡ 17 ¡ ఏప్రిల్ ¡ 2023



నృసింహునికి పూజలు

ధర్మపురి: అదనపు కలెక్టర్ మకరంద్ దంపతులు ఆదివారం ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామిని దర్శించుకున్నారు.



రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను ఆదివారం సుమారు 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. తమను సల్లంగా చూడాలని మొక్కుకున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
40.0/26.0

వాతావరణం

ఉదయం వాతావరణం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది.

రంజాన్ వేళలు

నీతి నిజాయితీగా సంపాదించేదే ఉత్తమ సంపద
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
సోమ 6:36	మంగళ 4:30

న్యూస్‌రీల్

'పీపుల్స్ మార్చ్' విజయవంతం చేయండి



మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: మండలంలో ఈనెల 17న సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పీపుల్‌మార్చ్ పాదయాత్ర కొనసాగుతుందని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. మండలంలోని దొంగతుర్తిలో ఆదివారం మాట్లాడారు. సోమవారం సాయంత్రం మండలంలోని రచ్చపల్లికి భట్టి పాదయాత్ర చేరుకుంటుందని, మంగవారం ఉదయం రచ్చపల్లి, రామయ్యపల్లి మీదుగా కొనసాగుతుందని, రామయ్యపల్లి క్రాస్‌రోడ్డు వద్ద కార్నర్‌మీటింగ్ ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, ప్రజలు తరలిరావాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, నాయకులు కాంపెల్లి రాజేశం, మహమ్మద్ అష్రఫ్, వేల్పుల శంకర్, దాసరి సంతోష్, తమ్మడవేని రవి, ముక్కెర ఆశాలు, వేల్పుల శ్రీనివాస్, మందపెల్లి మల్లేశం, బెల్లాల మల్లయ్య, కాల్వ రవి తదితరులు పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయండి

గోదావరిఖని: పీపుల్స్‌మార్చ్ యాత్రను ఐఎన్‌టీయూసీ శ్రేణులు విజయవంతం చేయాలని సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కోరారు. ఈనెల 17న కోల్‌కత్తాలో జేబీసీసీ సమావేశం ఉన్నందున తాను యాత్రలో పాల్గొనలేకపోతున్నానని, నాయకులు తరలివెళ్లాలని పేర్కొన్నారు. ఆయన వెంట సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి, నాయకులు సదానందం, దాస్, పోచయ్య, బుచ్చయ్య, ఆంజనేయులు, నాగరాజు, సమ్మయ్య ఉన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



విన్యాసాలు చేస్తున్న ఫైర్ సిబ్బంది


కోల్‌సిటీ: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా స్థానిక అగ్నిమాపక శాఖ సిబ్బంది గోదావరిఖనిలో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను మార్కండేయకాలనీలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సత్యనారాయణ డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది, పేషెంట్లు, బంధువులకు అవగాహన కల్పించారు. ప్రమాదంలో చిక్కుకుని గాయపడి స్పృహ కోల్పోయినప్పుడు తీసుకునే విధానాలను ప్రదర్శించారు. సీపీఆర్ చేసే విధానంపైనా అవగాహన కల్పించారు. ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఆసుపత్రి ప్రతినిధులు అనిల్ కుమార్, ఫైర్ సిబ్బంది రమేశ్, శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రీనివాస్, బి.సంతోష్, రమేశ్ పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో..

జ్యోతినగర్: అగ్ని ప్రమాదాలపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆసుపత్రిలో అవగాహన కల్పించారు. అదనపు ప్రధాన అగ్నిమాపకుడు బి.శ్రవణ్ కుమార్, వాహన చోదకుడు జి.శ్రీనివాస్, అగ్నిమాపకుడు పి.నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

నీలి చెరువు నిర్మాణంపై నీలినీడలు

- రెండేళ్ల క్రితం నిధులు మంజూరు
- ఇంకా ప్రారంభంకాని పనులు
- సందిగ్ధంలో 1500 ఎకరాల సాగు



మారేడుపల్లి శివారులో నిర్మించనున్న నీలిచెరువు ప్రతిపాదిత స్థలం

పాలకుర్తి మండలం మారేడుపల్లి గ్రామశివారులో నిర్మించతలపెట్టిన నీలి చెరువు నిర్మాణంపై నీలినీడలు అలుముకున్నాయి. చెరువు నిర్మాణం కోసం 2021లో అధికారులు సర్వే నిర్వహించారు. వారు రూపొందించిన నివేదిక ఆధారంగా రూ.1.38కోట్ల నిధులు విడుదల చేస్తూ రాష్ట్రప్రభుత్వం 2021 జూలైలో జీవో విడుదల చేసింది. నిధులు విడుదలై రెండేళ్లు కావస్తున్నా ఇప్పటివరకు పనులు మాత్రం ప్రారంభించలేదు. ఫలితంగా పదేళ్లుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న అన్నదాతల ఆశలు అడియాసలు అవుతున్నాయి.

– పాలకుర్తి

ఐదు గ్రామాల రైతులకు సాగునీరు

నీలి చెరువు నిర్మాణం ద్వారా ధర్మపురి నియోజకవర్గంలోని ముంజంపల్లి, మారేడుపల్లి, ఉండేడ, రామగుండం నియోజకవర్గంలోని వేంనూర్, కుక్కలగూడూర్ పరిధిలో దాదాపు 1500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలనేది లక్ష్యం. నర్సింహుల కొండపై నుంచి వచ్చే వరదనీటితోపాటు సమీపంలోని బొట్లవనపర్తి, ఖానంపల్లి గ్రామాల నుంచి వచ్చే వరద నీరు ఆధారంగా చెరువును నిర్మించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ వరద పరిస్థితిని అంచనా వేసి రూపొందించిన నివేదిక ప్రకారం 23.89 ఎంసీ ఫీట్ల వరకు నీటి నిల్వ సామర్థ్యంగా నిర్ణయించారు. కేవలం వర్షం ద్వారా వచ్చే వరద నీటి ఆధారంగా కాకుండా నందిమేడారం రిజర్వాయర్ నుంచి లిఫ్ట్ ద్వారా కూడా చెరువును నింపినట్లయితే రైతులకు రెండు పంటలకు సాగునీటికి సమస్య ఉండదనేది రైతుల అభిప్రాయం. ఆ మేరకు ఆ దిశగా సర్వే నిర్వహించిన అధికారులు అందుకు అనుగుణంగా నివేదిక తయారుచేశారు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి చెరువు నిర్మాణానికి సేకరించిన భూమిని ఇరిగేషన్‌శాఖకు అధికారికంగా అప్పగించారు. అయితే చెరువు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు చెల్లించాల్సిన పరిహారం విషయంలో బడ్జెట్ అంచనాలు పెరిగినందున జాప్యం అవుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు అంటున్నారు. చెరువు నిర్మాణానికి మొత్తం 17ఎకరాల భూమిని ప్రతిపాదించగా.. అందులో కేవలం రెండెకరాలు మాత్రమే పట్టాభూమి. మిగతా 15ఎకరాలు ప్రభుత్వ భూమి అయినప్పటికీ అసైన్ భూమిగా రైతుల ఆధీనంలో ఉంది. దీంతో ఆ భూములు సాగుచేసుకుంటున్న రైతులు తమకు నష్టపరిహారం చెల్లించేవరకూ అప్పగించబోమని తేల్చి చెప్పడంతో అధికారులు తిరిగి మరోసారి అంచనాలు రూపొందించారు. దాదాపు రూ.3కోట్ల నిధులు అవసరమవుతాయని ప్రభుత్వానికి నివేదించారు. అయితే ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో చెరువు నిర్మాణం పనులు నిలిచిపోయాయి.

సాగునీటికి ఇబ్బందులు..

మారేడుపల్లి, ముంజంపల్లి, ఉండేడ గ్రామాలకు ఎస్సారెస్పీ నుంచి డీ–86కాలువ ద్వారా సాగునీరు అందుతోంది. అయితే టేలాండ్ కావడంతో సరిపడా నీరు సరఫరా కాక రైతులు వర్షాధారంగానే పంటలు సాగు చేసుకుంటున్నారు. యాసంగిలో కేవలం బావులు, బోర్లు ఉన్న రైతులు మాత్రమే సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంటలకు సరిపడా సాగునీరు లేక రైతులు తరచూ ఆందోళన చేస్తున్నారు. దీంతో వేంనూర్ పంప్‌హౌస్ నుంచి నందిమేడారం రిజర్వాయర్‌కు వెళ్లే పైప్‌లైన్ వాల్‌ను వేంనూర్ వద్ద ఓపెన్ చేసి.. సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటిని అందిస్తున్నారు. దీంతో పంటలకు నీరు అందుతోంది. ఏటా రైతుల ఆందోళనలతోనే సాగునీరు సరఫరా అవుతోంది. ప్రస్తుతం నీలిచెరువు నిర్మాణం పూర్తయితే ఆయా గ్రామాల పరిధిలోని రైతులకు సాగునీటికి ఎలాంటి ఢోకా ఉండదు. ఈ నేపథ్యంలో అధికారులు, పాలకులు స్పందించి త్వరితగతిన నీలిచెరువును నిర్మించి సాగునీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.

నిధులు విడుదల కాగానే పనులు

నీలిచెరువు నిర్మాణానికి సర్వే నిర్వహించి అవసరమైన భూసేకరణ చేపట్టాం. మొత్తం 17ఎకరాల్లో చెరువు నిర్మించేలా ప్రణాళిక రూపొందించాం. పట్టాభూములు కాకుండా అసైన్డ్ భూములు కలిగిన రైతులకూ పరిహారం చెల్లించేందుకు రూ.3కోట్ల నిధులు అవసరమున్నాయి. ఇందుకోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– కీర్తి, ఇరిగేషన్ డీఈఈ

వైద్యశాఖ అప్రమత్తం..!



ఐసోలేషన్ కేంద్రం వద్ద సిద్ధంగా ఆక్సిజన్

- కరోనా నేపథ్యంలో చర్యలు
- వార్డులు, ఐసోలేషన్స్ సిద్ధం చేస్తున్న వైనం

ఆసుపత్రి	ఆక్సిజన్‌ప్లాంట్ (ఎల్ఎంపీ)	పడకలు
పెద్దపల్లి	220	20
గోదావరిఖని	500	50
సుల్తానాబాద్	280	30
మంథని	50	05

సుల్తానాబాద్: రాష్ట్రంలోని చాలాచోట్ల కరోనా కేసులు వెలుగుచూస్తున్న నేపథ్యంలో జిల్లా వైద్యశాఖ అప్రమత్తమైంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేయాల్సిన ఏర్పాట్లపై వైద్యాధికారులు సమావేశమయ్యారు. అవసరమైన ఏర్పాట్లపై డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్ని విభాగాల అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆక్సిజన్ సదుపాయం కలిగిన మంచాలు ఉన్నాయి. వాటితోపాటు వెంటిలేటర్స్ కూడా ఉన్నాయి. ఇప్పటివరకైతే కొవిడ్ బాధితులెవరూ ఇన్‌పేషెంట్లుగా చేరలేదు.

ప్రతిరోజూ పరీక్షలు

ఆసుపత్రిలో ప్రతిరోజూ ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం 32మందిని పరీక్షించగా ఒక్కరికి, శనివారం 15మందిని పరీక్షించగా ఒక్కరికి పాజిటివ్ లక్షణాలు ఉన్నాయని తేలింది. అయితే వారికి స్వల్ప లక్షణాలే ఉండటంతో మందులకిట్లు ఇచ్చి ఇళ్లకు పంపించారు. మరోవైపు కేసులు పెరిగితే వారికి వైద్యసేవలు అందించడానికి ప్రత్యేకంగా నాలుగైదు పడకలను సిద్ధం చేసుకుంటున్నారు. ఆక్సిజన్ సరఫరా, పీపీఈ కిట్లను వైద్యులకు అందించడం, రోగులకు ఇంజక్షన్లు, ఇతర రకాల మందులు అందించడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాకేంద్ర ఆసుపత్రితోపాటు గోదావరిఖని, సుల్తానాబాద్, మంథని ఆసుపత్రుల్లో ఆక్సిజన్‌తో పాటు వసతులు, మందుల కోసం ఉన్నతాధికారులకు నివేదించారు. ప్రస్తుతం జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఆక్సిజన్ ప్లాంట్లను నెలకొల్పారు. కొవిడ్ వార్డుల్లో ఉన్న పడకలకు ఆక్సిజన్‌ను అనుసంధానం చేశారు. 24గంటలు పర్యవేక్షించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారు.

అందుబాటులోకి ఆక్సిజన్ ప్లాంట్లు

జిల్లాలో ఆక్సిజన్ ప్లాంట్లు అందుబాటులోకి వచ్చాయి. గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో 500, సుల్తానాబాద్‌లో 280 ఎల్ఎంపీ సామర్థ్యంగల ప్లాంట్లు ఉన్నాయి. సింగరేణి అస్పత్రిలో కూడా 500 ఎల్ఎంపీ సామర్థ్యం ఉన్న ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు చేశారు.

అందుబాటులో మందులు



పాజిటివ్ కేసులు వెలుగుచూస్తున్న క్రమంలో వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. అన్ని ఆస్పత్రుల్లో సౌకర్యాలు సమకూర్చుకుంటున్నాం. పడకలతో పాటు ఆక్సిజన్, మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుకుంటున్నాం. కరోనాకు సంబంధించిన మందులు తెప్పిస్తున్నాం.

– శ్రీధర్, డీసీహెచ్

సిద్ధంగా ఉన్నాం



కరోనాను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇతర దేశాల నుంచి వచ్చే వారి వివరాలు సేకరించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఆదేశాలిచ్చాం. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఆక్సిజన్ ప్లాంట్లు, బెడ్లు సిద్ధం చేసుకున్నాం. ప్రజలు తప్పనిసరిగా మాస్కులు ధరించాలి. భౌతిక దూరం పాటించాలి.

– ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌వో

ప్రజల బాగోగుల బాధ్యత ప్రజాప్రతినిధులదే..

- గుడుంబా బంద్ చేస్తే తమవంతు సాయం
- బస్తీ ప్రజాచైతన్య సదస్సులో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు



మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని: ప్రజాప్రతినిధులు కేవలం ఓట్లకే పరిమితం కాకుండా ప్రజల బాగోగులు కూడా చూడాల్సిన బాధ్యత ఉంటుందని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. బస్తీ ప్రజాచైతన్య యాత్రలో భాగంగా ఆదివారం మంథని మున్సిపాలిటీ పరిధి ఉస్మాన్‌పురలో పర్యటించారు. బస్తీవాసులతో సమావేశమయ్యారు. నాటుసారాకు బానిసై యువత ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వార్డులోని ఇద్దరు యువకులు మద్యం తీసుకోబోమని ప్రమాణం చేసి చిరువ్యాపారం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని, వారిని మిగతా యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి పేదవాడి గురించి తాను ఆలోచన చేస్తానన్నారు. నాటుసారా బంద్ చేసే యువతకు, కుటుంబాలకు తాము సాయంగా ఉంటామన్నారు. వారి భవిష్యత్తుకు తోడుగా ఉంటామని పేర్కొన్నారు. యువత కోసం వారానికోవార్డును పర్యటించి వారిలో చైతన్యం తెస్తామన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, కౌన్సిలర్ గర్రెపల్లి సత్యనారాయణ, వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు సతీష్

సుల్తానాబాద్: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మెరుగు సతీశ్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో ఆదివారం మాట్లాడారు. 30ఏళ్ల సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులు ఏ క్యాడర్‌లో నియామకమయ్యారో.. అదే క్యాడర్‌లో విరమణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సీపీఎస్ రద్దు కేంద్రం పరిధిలో అంశమంటూ రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందని, మిగతా రాష్ట్రాల్లో మాత్రం రద్దు చేశారని గుర్తు చేశారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శి సహేందర్, జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్, తోట రాజు, రాష్ట్ర కన్వీనర్ మాధవాచారి, ఆర్థిక కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, మహేందర్ రెడ్డి, శ్రవణ్ కుమార్, సమ్మయ్య, ఆనందరావు, చంద్రశేఖర్, మల్లికార్జున్, శ్రీనివాస్, రాజేశ్, ప్రభాకర్ రెడ్డి, సత్యనారాయణ, వీరారెడ్డి, నర్సింగం, శ్రీనివాస్, సురేష్ తదితరులు ఉన్నారు.

సింగరేణి బొగ్గుకు పెరిగిన డిమాండ్

- ఓసీపీల్లో ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి
- వర్షాకాలంలోపే లక్ష్యాలు సాధించాలి
- అన్ని ఏరియాల జీఎంలకు డైరెక్టర్ల దిశానిర్దేశం



ఓసీపీల్లో బొగ్గు వెలికితీస్తున్న షావల్

గోదావరిఖని: ఎండలు మండుతున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరిగింది. ఫలితంగా బొగ్గుకు డిమాండ్ అధికమైంది. సింగరేణి బొగ్గు కోసం వినియోగదారుల నుంచి ఒత్తిడి పెరగడంతో ఆ మేరకు ఉత్పత్తి చేయాలనే సంకల్పంతో యాజమాన్యం ముందుకు సాగుతోంది. ఇందులోభాగంగా ఉత్పత్తి లక్ష్యాల సాధనపై అన్ని ఏరియాల జీఎంలతో యాజమాన్యం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించింది. సంస్థ వ్యాప్తంగా రోజుకు 2.30లక్షల టన్నుల బొగ్గు వెలికితీయాలని, నిల్వ ఉన్న బొగ్గుతో కలిపి 2.35లక్షల టన్నులు రవాణా చేయాలని, ఇందుకు అన్ని ఏరియాల జీఎంలు దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేసింది.

కోల్ లింకేజీకి అనుగుణంగా రవాణా..

వినియోగదారులతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం బొగ్గును సకాలంలో అందించేలా యాజమాన్యం నిర్ణయించింది. సింగరేణి నుంచి పలు విద్యుత్ ప్లాంట్లకు రైల్వేద్వారా బొగ్గు రవాణా అవుతోంది. ప్రతిరోజు 2లక్షల టన్నులు రైల్వే ద్వారా వెళ్తోంది. రామగుండం ఎన్టీపీసీ, కర్నాటక పవర్ కార్పొరేషన్ (కేటీపీసీ), కర్నాటక కుడివి ఎన్టీపీసీ, బళ్లారి థర్మల్ పవర్, ముద్దునూరు రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్, సోలాపూర్ ఎన్టీపీసీ, విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్లకు సింగరేణి నుంచి బొగ్గు రవాణా అవుతోంది. వేసవికాలం కావడం.. విద్యుత్‌కు డిమాండ్ పెరగడంతో థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి బొగ్గు అవసరాలు పెరిగాయి. సింగరేణితో కోల్‌లింకేజీ ఉన్న అన్ని థర్మల్ కేంద్రాల నుంచి బొగ్గు కోసం ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలో సింగరేణి డైరెక్టర్లు అప్రమత్తమయ్యారు. అన్ని ఏరియాల జీఎంలతో సమావేశమై ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. అంతేకాకుండా అన్ని ఏరియాల్లో డైరెక్టర్లు సుడిగాలి పర్యటన చేపట్టారు.

రోడ్డు మార్గం ద్వారా రవాణా పెంచాలి..

బొగ్గు నిల్వలు అధికంగా ఉన్న ఏరియాల నుంచి రోడ్డు మార్గం ద్వారా రవాణా పెంచాలని నిర్దేశించారు. ఓసీపీల్లో బొగ్గు వెలికితీతకు ప్రధాన ప్రతిబంధకంగా ఉండే మట్టిని వెలికితీయడంపైనా దృష్టి పెట్టారు. ప్రస్తుతం సంస్థ వ్యాప్తంగా 14.78 క్యూబిక్‌మీటర్ల ఓబీ తొలగిస్తుండగా దీన్ని 16.50క్యూబిక్ మీటర్లకు పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. వర్షాకాలానికి ముందే లక్ష్యాలు సాధించాలి

బొగ్గు ఉత్పత్తిలో కీలకపాత్ర పోషించే ఓసీపీలపై యాజమాన్యం దృష్టిపెట్టింది. ప్రధానంగా రాబోయే రెండు నెలల్లో ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తే వర్షాకాలంలో ఉత్పత్తి కోసం పెద్దగా ఒత్తిడి ఉండబోదని భావిస్తోంది. జూన్‌లో వర్షాలు ప్రారంభమైతే అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధించే ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీత నిలచిపోనుంది. దీంతో లక్ష్యాలు సాధన కష్టసాధ్యంగా మారుతుంది. ఈ క్రమంలో వేసవికాలంలో లక్ష్యాలను పూర్తి చేసి వర్షాకాలంలో కూడా ఉత్పత్తి కోసం ఓసీపీలను సిద్ధం చేసుకోవాలని సూచించింది. ఏమాత్రం వర్షం తెరిపినిచ్చినా ఆ సమయంలో బొగ్గు వెలికితీసేలా ఏర్పాట్లు ఉండాలని సూచించింది.

'భట్టి' పాదయాత్రకు ఘన స్వాగతం

- వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- జైకాంగ్రెస్ నినాదాలతో మార్మోగిన ఎల్లంపల్లి



మంచిర్యాల నుంచి పాదయాత్రగా సీఎల్పీ భట్టి విక్రమార్క

రామగుండం: శాసనసభా పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర ఆదివారం రాత్రి మంచిర్యాల జిల్లా నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు మీదుగా రామగుండం నియోజకవర్గ పరిధిలోని ఎల్లంపల్లి గ్రామానికి చేరుకుంది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు వేలాదిగా తరలివచ్చి భట్టికి ఘన స్వాగతం పలికారు. ఆయన అడుగులో అడుగేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు వంతెన పార్టీ శ్రేణులతో జనసంద్రంగా మారింది. ఎల్లంపల్లికి చెందిన గంగపుత్రులు చేపలవలను సీఎల్పీ నేతకు బహూకరించి.. సొసైటీల్లో సభ్యత్వాల సమస్య ఉందని ఏకరువు పెట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గంగపుత్రుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మార్గంమధ్యలో ఉన్న కస్తూర్బా విద్యాలయానికి చేరుకోగానే 9వ తరగతి విద్యార్థిని శరణ్య 'సార్ మాకు తాగునీటి సమస్య ఉంది..' అని తెలపగా సమస్యను నమోదు చేసుకున్నారు. అనంతరం ముర్మూర్ గ్రామ శివారులోని దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గదిలో బస చేసేందుకు వెళ్లారు. సీఎల్పీ వెంట కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక ప్రతినిధులు, పార్టీ శ్రేణులు వేలాదిగా ఉన్నారు.



భట్టి విక్రమార్కతో కలిసి నడుస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాగూర్, తదితరులు

క్లుప్తంగా

ఘనంగా సన్మానం



సుల్తానాబాద్: ఐఎంఏ జిల్లా అధ్యక్షుడిగా రమాకాంత్, కార్యదర్శిగా డాక్టర్‌ప్రణీత్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా డీవీఎస్ మూర్తి ఎన్నుకోవడంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం నూతనంగా ఎన్నికైన పెద్దపల్లి ఐఎంఏ, అడ్వకేట్ బార్ అసోసియేషన్ సభ్యులకు సన్మానించారు. కొండి ఫౌండేషన్ చైర్మన్ సతీశ్ జేఏసీటీయూ కన్వీనర్ ఆకుల స్వామి, కోమటిపల్లి రాజేందర్, అజీజ్, రాజేషం, రమణ ఉన్నారు.

నియామకం



కృష్ణమూర్తి

సుల్తానాబాద్: జిల్లా రా రైస్‌మిల్ అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కొమురవెల్లి రాజేందర్ అధ్యక్షుడిగా జంగా దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కంది చుక్కారెడ్డి, చింతకింది విశ్వనాథం, సత్యనారాయణ గౌడ్, పోలేటి వేణు రాయమల్లు, సాజిద్, ప్రధానకార్యదర్శిగా ఇల్లందుల కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీగా రాజ్‌కుమార్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా వేణును కోశాధికారిగా పుల్లూరి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.నూతన కార్యవర్గ సభ్యులు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

వృద్ధుడి నేత్రాలు దానం

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని కల్వచర్లకు చెందిన కౌొట్టి వెంకటరమణయ్య(85) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందగా మృతుడి నేత్రాలను కుటుంబ సభ్యులు సదాశాయ ఫౌండేషన్ ప్రతినిధి కే.ఎస్.వాసుఆధ్వర్యంలో దానంచేశారు. నేత్రాలను దానంచేసిన కుటుంబసభ్యులను ఫౌండేషన్ సభ్యులు అభినందించారు.

అన్నదాతలపై ‘కోతల’ భారం

- హార్వెస్టర్ గంటకు రూ.2,500
- చైన్ మిషన్‌కు రూ.3,200

సుల్తానాబాద్: వరికోతలకు అన్నదాతలు హార్వెస్టర్లపైనే ఆధారపడుతున్నారు. పంటలు అమ్మే వరకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ లాభాలు అంతంతమాత్రంగానే వస్తున్నాయి. ఈ ఏడాది యాసంగిలో ఒకవైపు తెగుళ్లు, పిచికారీకి భారీగా ఖర్చుకాగా, మరోవైపు వడగళ్ల వాన జిల్లాలోని పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. దీంతో వరికోతలతో రైతులకు మరింత భారం పడుతోంది. ఈక్రమంలో జిల్లావ్యాప్తంగా వరికోతలు మొదలవగా హార్వెస్టర్లకు అద్దె భారీగా పెరిగింది. అంతే కాకుండా ధాన్యాన్ని కల్లాలకు తరలించేందుకు రవాణాచార్జీలు సైతం తడిసిమోపెడవుతున్నాయి. డీజిల్ ధరలు సాకుగా చూపుతూ ధాన్యాన్ని సరఫరా చేయడానికి ట్రాక్టర్ల యజమానులు ధరలు అమాంతం పెంచేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా యాసంగిలో వరి 2,78,905 ఎకరాల్లో సాగుచేశారు. గత వర్షాకాలం వరికోతలు చేసే టూ వీలర్ హార్వెస్టర్ యంత్రానికి గంటకు రూ.1500 ఉండగా ఇప్పుడు రూ.1800–2000 వేలకు పెంచారు. దిగుడు నేలల్లో యంత్రాలు కూరుకుపోతే వేగంగా ముందుకు కదలక వరికోతకు సమయం ఎక్కువ పడుతోందని రైతులు చెబుతున్నారు. పశుగ్రాసం సేకరణలో భాగంగా ఎండు గడ్డిని కట్టలు కట్టేందుకు బేలర్ యంత్రాలు, గడ్డి రవాణాకు ట్రాక్టర్ చార్జీలను యజమానులు పెంచుతున్నారని రైతులు వాపోతున్నారు. ట్రాక్టర్ యంత్రాలతో వరి కోయడం వల్ల పశుగ్రాసం పనికిరాకుండా పోయే అవకాశం ఉందని చెబుతున్నారు.

కేవలం గంటల వ్యవధిలోనే...

జిల్లాలో 14 మండలాలుండగా 266 జీపీలున్నాయి పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్, గోదావరిఖని ప్రాంతాల్లో ఎకరంలో సాగుచేసిన పంటలను కేవలం గంట వ్యవధిలోనే హార్వెస్టర్లతో కోస్తున్నారు. దీంతో యంత్రం నుంచి నేరుగా ట్రాక్టర్లోకి ధాన్యం



వరిని కోస్తున్న హార్వెస్టర్, చైన్ మిషన్

మార్పిడిచేస్తూ ఇళ్లవద్దకు, కల్లాలకు ఐకేపీ కేంద్రాలకు తరలిస్తున్నారు. మార్పిడితో సంబంధం లేకుండా నేరుగా ధాన్యాన్ని కుప్పగా పోయగానే రైతులు బస్తాల్లో నింపి తరలించడం అప్పటికప్పుడు జరిగిపోతోంది. కోత యంత్రాలు అందుబాటులోకి రావడంతో రైతులు సాగువిస్తీర్ణాన్ని కూడా పెంచేశారు. గతంలో వేల ఎకరాల్లో సాగయ్యే వరి ప్రస్తుతం లక్ష ఎకరాలకు పైగా సాగు చేస్తున్నారు. వరిసాగుకు తగ్గట్టు యంత్రాల సంఖ్య లేకపోవడంతో రైతులు హార్వెస్టర్ల కోసం ఎదురు చూడాల్సి పరిస్థితి నెలకొంది.

హార్వెస్టర్‌తో ఎకరాకు రూ.2వేలు చైన్‌మిషన్‌కు రూ.3,200

ఎకరం పొలంలో వరిని కోయాలంటే యంత్రాల యజమానులు గంటకు రూ.2వేలు చైన్‌మిషన్‌కు రూ. 3200 నుంచి 3,500 వసూలు చేస్తున్నారు. తేమ పొడిగా ఉండే పొలంలోనే కోతలు సాఫీగా సాగిపోతాయి. ఎక్కువ తేమ ఉన్న పొలంలోని వరిని కోయాలంటే యంత్రాలకు గంటకుపైగా సమయం పడుతోంది. ఈక్రమంలో రైతుల నుంచి నిర్ణీత చార్జీలకు అదనంగా వసూలు చేస్తున్నారు. యంత్రాలు తక్కువగా ఉండడంతో రైతులు ముందస్తుగా బుక్‌చేసుకుని మరీ కోతలు కోయించాల్సివస్తోంది. కొనుగోలు కేంద్రాలు ఇదే నెల మూడో వారంలో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కోత యంత్రాలకు డిమాండ్ మరింత పెరిగితే చార్జీలు కూడా పెరిగే అవకాశం ఉంది.

ఆంధ్ర ప్రాంతంతో పాటు నల్గొండ నుంచి ఎక్కువగా యంత్రాలు

జిల్లాలో అవసరం మేరకు వరికోత యంత్రాలు లేకపోవడంతో సీజన్‌ల వారీగా ఆంధ్ర, నల్గొండ జిల్లాల నుంచి వరికోత యంత్రాలు వస్తున్నాయి. నెలరోజులకు పైగా యజమానులు కోతలు చేపట్టి అద్దెరూపంలో వచ్చే ఆదాయంతో లాభపడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు మూసే గడువు దగ్గర పడే సమయంలో యంత్రాల యజమానులు కోతలకు సంబంధించిన చార్జీలు ఇష్టం వచ్చినట్లు పెంచేస్తున్నారు. ఇది రైతులకు ఆర్థిక ఇబ్బందిని కలిగిస్తున్నా తప్పే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

చెరువుల కింద వరి కోతకు ఎక్కువ



చెరువుల కింద పొలాలకు మామూలు హార్వెస్టర్లు పనిచేయవు. చైన్‌మిషన్ ద్వారా వరికోయాలి. దానికి రూ.3వేల, 3500 గంటకు ధర పలుకుతోంది. ఎకరం కోసే అవకాశముంది. డీజిల్ ధరలు పెంచడంతో రైతులపై తీవ్ర ప్రభావం పడుతోంది. రైతులపై భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ధరలు పెంచవద్దు.

– మహేశ్, రైతు, సుల్తానాబాద్

ఎకరాకు రూ.500 ఖర్చు



స్థానికంగా హార్వెస్టర్లు, చైన్ మిషన్లు లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి కోతకు వస్తున్నారు. కోతలు ఒకే నెల ఉండడంతో డీజిల్ ధర సాకుగా చూపుతూ రూ.500 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై హార్వెస్టర్లను, చైన్‌మిషన్లను రైతులకు అందించాలి. దీంతో స్థానికంగా రైతులకు ఇబ్బందులుండవు.

– కోట నాగేశ్వర్ రైతు కదంబాపూర్

పెరుగుతున్న డీజిల్ భారం

ప్రస్తుతం డీజిల్ లీటర్‌కు రూ. 98.22 చేరుకుంది. జిల్లావ్యాప్తంగా ఈ సీజన్లో 2,78,905 లక్షల ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఎకరానికి పెరిగిన ధరకు అనుగుణంగా సుమారు రైతులపై రూ.తొమ్మిది కోట్ల వరకు భారంపడే అవకాశం ఉంది.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



పెద్దపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

సుల్తానాబాద్: పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం పునరుద్ధరించాలని టీఎస్‌సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లింగంపల్లి శ్రీనివాస్, జంపాల అజయ్ కోరారు. ఆదివారం జిల్లాకేంద్రంలో పెన్షన్ కంట్రిబ్యూషన్ మార్చి ర్యాలీని ఉద్దేశించి మాట్లాడారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో పాత పెన్షన్ విధానం కొనసాగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, సుధాకర్, రాజేందర్, కుమార్, రాజమణి, వెంకటేశ్, సంపత్, అంజయ్య, రఘునందన్, నరేందర్ తదితరులు ఉన్నారు.

బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం కావాలి



మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

సుల్తానాబాద్: బీజేపీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. శక్తికేంద్రాలను బలోపేతం చేసినప్పుడే అధికారంలోకొస్తామని, దానిపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మీస అర్జున్ రావు, జిల్లా కార్యదర్శి కర్రె సంజీవరెడ్డి, అధికార ప్రతినిధి ఆది కేశవరావు, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీపీఎల్ భూములు నిరుపయోగం..!

- రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి అనుకూలంగా స్థలం
- ప్రభుత్వం ఆలోచించాలంటున్న స్థానికులు
- నిర్వాసితులకైనా అప్పగించాలని డిమాండ్

రామగుండం: సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం బీపీఎల్ సంస్థ రామగుండంలో విద్యుత్ కేంద్రం స్థాపనకు అప్పటి ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. బీపీఎల్ యాజమాన్యానికి ప్రభుత్వానికి మధ్య విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై ఏకాభిప్రాయం కుదరక పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో సేకరించిన వందల ఎకరాల భూములు నిరుపయోగంగా మారాయి. 1994లో అప్పటి టీడీపీ ప్రభుత్వం బెంగళూరుకు చెందిన మారుబెని, తోషిబా, ఎలక్ట్రిక్ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (జపాన్) సంస్థలకు దశలవారీగా ప్రాజెక్టును అప్పగించారు. పట్టణంలో మూతపడ్డ ఏ పవర్‌హౌజ్ ఆనాటి ఏపీఎస్ఈబీ, బ్రాహ్మణపల్లి, పెద్దంపేట తదితర గ్రామాలకు చెందిన రైతుల నుంచి ఎకరాకు రూ.33వేలు చెల్లించి మొత్తంగా 1817 ఎకరాలు సేకరించింది. విద్యుత్ కేంద్రం సామర్థ్యం 520 మెగావాట్లకు గాను రూ.2,813.9 కోట్లుగా నిర్ణయించారు.

భూముల సేకరణ ఇలా..

మూతపడిన ఏ–పవర్‌హౌజ్ స్థలం 750 ఎకరాలు, మల్యాలపల్లి రైతుల నుంచి 169.25, ప్రభుత్వ భూమి 87.09, కుందనపల్లిలో 52.21, ప్రభుత్వ భూమి 4.23, రామగుండంలో 6.29, ప్రభుత్వ భూమి 181.39, రాయదండిలో 384.22, ప్రభుత్వ భూమి 228.06, బ్రాహ్మణపల్లిలో 640.19,



శిథిలావస్థలో షాపింగ్ కాంప్లెక్స్, అతిథి గృహాలు

ప్రభుత్వ భూమి 33.35, ఎల్లంపల్లి 7.13, ప్రభుత్వ భూమి 4.01, గోలివాడ రైతుల నుంచి 10.29, ప్రభుత్వ భూమి 5.13 ఎకరాలు కలిపి మొత్తంగా రైతుల నుంచి 1271.38 ఎకరాలు, ప్రభుత్వం నుంచి 543.05ఎకరాలు సేకరించింది.

వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు

భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యాక ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో అనుమతులు పొందిన తర్వాత బీపీఎల్ యాజమాన్యం విద్యుత్‌కేంద్రం పనులను వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే తొలుత 275 మీటర్ల చిమ్నీ నిర్మించాలని తలపెట్టారు. మూతపడే నాటికే మూడు మీటర్ల నిర్మాణం చేపట్టారు. దీంతో పాటు టర్బయిన్, జనరేషన్ ఫౌండేషన్ ప్లాట్‌ఫారం, సబ్‌స్టేషన్ ఫౌండేషన్, ప్రహరీ, గోదావరి నుంచి అంతర్గాంకు పైపులైన్ రోడ్, భూసేకరణలో గృహాలు కోల్పోయిన సుమారు రెండు వందల మందికి పట్టణంలోని అయోధ్యనగర్‌లో ఇళ్ల పట్టాలు, ప్రధానవిద్యుత్ కేంద్రానికి అంతర్గత రహదారులు, అధికారుల అతిథి గృహాలు, షాపింగ్ కాంప్లెక్స్, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణాలు మొత్తంగా రూ.వెయ్యి కోట్లకు పైగా వెచ్చించింది. ప్రస్తుతం బీపీఎల్ సంస్థ తొలుత థర్మల్ కేంద్రం నిర్మాణానికి అనుమతులు పొందగా.. పీపీఏతో పాటు తర్వాత అధికారంలోకి వచ్చిన



బీపీఎల్ భూముల వద్ద ఏర్పాటుచేసిన బోర్డు

ప్రభుత్వంతో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో అర్థాంతరంగా పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో 2019లో రెండోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీపీఎల్ యాజమాన్యం రామగుండంలో సోలార్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. దీనిపై ఇంకా తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి బీపీఎల్ భూములు అనుకూలం

కేంద్రప్రభుత్వం ఖాజీపేటలో ప్రతిపాదిత కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం భూములు అప్పగించకపోవడంతో పెండింగ్‌లో ఉంది. అయితే రామగుండం రైల్వేస్టేషన్ సరిహద్దులోనే బీపీఎల్ భూములు ఉండడంతో రైల్వే ట్రాక్‌ను బీపీఎల్ భూములకు అనుసంధానించుకునే అవకాశం ఉండడంతో కోచ్ ఫ్యాక్టరీకి అనుకూలంగా ఉంటుందని, తద్వారా నిర్వాసితులందరికీ ఉపాధి అవకాశాలు లభిస్తాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రతిపాదిస్తే ఏలాంటి పర్యావరణ సమస్యలు తలెత్తకుండా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది.

ఆదాయం ఘనం.. అభివృద్ధి శూన్యం

- ఓదెల మల్లన్న సన్నిధిలో కేవలం ఐదే మరుగుదొడ్లు
- బహిరంగ ప్రదేశాల్లోనే భక్తుల మల విసర్జన
- దుర్గంధం వెదజల్లుతున్న చుట్టుపక్కల రోడ్లు
- నిత్యం ఐదు వేలకుపైగా భక్తుల రాక
- పట్టించుకోని దేవాదాయశాఖ అధికారులు
- అడ్రస్ లేని సులభ్‌కాంప్లెక్స్‌లు



ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో మరగుదొడ్లు

ఓదెల: పెద్దపల్లి జిల్లాలో పేరుగాంచిన ప్రముఖ శైవ క్షేత్రం ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో మూత్రశాలలు, మరగుదొడ్లు లేక భక్తులు నరకయాతన పడుతున్నారు. ఓదెల మల్లన్న క్షేత్ర దర్శనానికి పట్టణ, సింగరేణి, ఉమ్మడి కరీంనగర్‌జిల్లా, మహారాష్ట్ర నుంచి నిత్యం 5 నుంచి 10వేల లోపు భక్తులు వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం స్త్రీ, పురుషులకు కలిపి కేవలం ఐదు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. దీంతో ఆలయానికి వచ్చే మహిళలకు మరగుదొడ్లు సరిపోక చుట్టుపక్కల రహదార్లు, పంటపొలాలను వాడుకుంటున్నారు. దీంతో ముక్కుపుటాలు అదరగొట్టే విధంగా అపరిశుభ్రమైన వాతావరణ నెలకొంది. ఆలయం లోపలికి వెళ్లే ముందు, అబ్బిడిపల్లె, కొమిర రహదార్లకు ఇరువైపులా భక్తులు బహిర్భూమికి వెళ్లడంతో భరించలేని దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఇక మహిళల పరిస్థితి చెప్పలేనివిధంగా ఉంది. స్వచ్ఛందసంస్థలు, డీఆర్డీఏ శాఖ, దేవదాయశాఖలు ఉన్నప్పటికీ పట్టించుకునే వారులేకుండా పోయారు. ఆలయం నుంచి ఆదాయం కోట్లలో వచ్చినప్పటికీ కనీసం మూత్రశాలలు, మరగుదొడ్లు ఏర్పాటు చేసే విషయంలో దేవదాయశాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పుట్టగొడుగుల్లా ఉన్న స్వచ్ఛంద స్థంస్థలు కూడా మల్లన్నదేవుడి వైపు కన్నెత్తిచూడకపోవడం శోచనీయం. ఆలయంలో భక్తుల రద్దీకి సరిపడే మూత్రశాలలు, మరగుదొడ్లు , సులభ్‌కాంప్లెక్స్‌లు నిర్మిస్తే భక్తుల ఇబ్బందులు తొలగుతాయని పేర్కొంటున్నారు.

మహిళలు చెప్పరాని బాధలు పడుతున్నారు



ఓదెల మల్లన్న సన్నిధిలో అవసరమైనన్ని మరగుదొడ్లు లేక మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ఆలయంలో భక్తులకు సరిపడే మూత్రశాలలు, మరగుదొడ్లు నిర్మించాలి. ఆలయం చుట్టూ ఉన్న స్థలం కనీస సౌకర్యాలు కల్పించాలి.

–చంద్రకళ ఈస్ట్‌మారెడ్‌పల్లి భక్తురాలు

పొలాల వెంట వెళ్లాల్సి వస్తోంది



ఓదెల ఆలయంలో మూత్రశాలలు లేకపోవడంతో పంటపొలాలకు వెళ్లాల్సివస్తోంది. చాల ఏళ్లుగా ఓదెల గుడికి వస్తున్నాం. ఎన్నో ఏళ్లుగా సదుపాయాలు లేవు. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించి ఆలయంను అభివృద్ధి చేయాలి.

– అడుల సంపత్, హుజూరాబాద్, భక్తుడు

సులభ్‌కాంప్లెక్స్‌లు నిర్మించాలి



ఓదెలమల్లన్న గుడిలో సులభ్‌కాంప్లెక్స్‌లు నిర్మించాలి. ప్రస్తుతమున్న మరగుదొడ్లు సరిపడక దేవుడి గుడిచుట్టూ ఉన్న రోడ్లపై వెళ్లక తప్పడం లేదు. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించి ఇబ్బందులు తొలగించాలి.

– పోశవ్వ ,బెల్లంపల్లి, భక్తురాలు

ఆర్టీసీ చెకింగ్ స్క్వాడ్‌పై అట్రాసిటీ కేసు

గోదావరిఖని: కులంపేరుతో ఉద్దేశపూర్వకంగా కించపరిచి చెకింగ్‌స్క్వాడ్ ఇబ్బందులకు గురిచేశారని కరీంనగర్–2 డిపో కండక్టర్ కింసారపు కోమల ఆదివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో కూడా రెండు, మూడు సార్లు ఇబ్బందులకు గురిచేసినట్లు కండక్టర్ వాపోయారు. సమయానికి బస్సు బస్టాండ్‌కు చేరుకున్నప్పటికీ అరగంట ముందుగా వచ్చారని బలవంతంగా రాయించుకుని సంతకం తీసుకున్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఈనెల 5న కరీంనగర్ నుంచి గోదావరిఖనికి వస్తున్న క్రమంలో గోదావరిఖని బస్టాండ్ వద్ద కండక్టర్ డ్యూటీలో ఉన్న కోమల బస్సును ఆపి చెక్‌చేసి కులం పేరుతో తిట్టారని ఇచ్చిన ఫిర్యాదుతో కరీంనగర్ చెకింగ్‌స్క్వాడ్ భాస్కరాచారి, జీకేరెడ్డి, కేఆర్‌రెడ్డి, జి.లక్ష్మణ్‌పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

మల్లన్న సన్నిధిలో భక్తుల కోలాహలం



ఓదెల: శ్రీమల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి వచ్చి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి బోనాలు చేసి నైవేద్యంగా సమర్పించారు. ఒగ్గుపూజారులతో పట్నాలు వేశారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ పాలకవర్గం పర్యవేక్షించింది.

నారాయణ హైస్కూల్ ప్రిన్సిపాల్‌పై కేసు

గోదావరిఖని: పిల్లల నుంచి ఫీజులు వసూలు చేసి యాజమాన్యానికి చెల్లించకుండా గోదావరిఖనిలోని నారాయణ హైస్కూల్ ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై వెంకన్న తెలిపారు. విద్యార్థుల వద్ద నుంచి రూ.15లక్షలు వసూలు చేసి యాజమాన్యానికి చెల్లించలేదన్నారు. ఈ మేరకు నారాయణ హైస్కూల్ ఏజీఎం చైతన్యరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కార్మికులకు స్వచ్ఛమైన తాగునీరందించాలి

- బీఎంఎస్ అధ్యక్షులు యాదగిరి సత్తయ్య



వినతిపత్రం ఇస్తున్న సత్తయ్య

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు స్వచ్ఛమైన తాగునీరందించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పర్సనల్ అధికారి నరేన్ చక్రవర్తికి వినతిపత్రం అందించారు. రాపిడ్ గ్రావిటీ ఫిల్టరైజేషన్ కోసం రూ.20 కోట్లు కేటాయించినప్పటికీ ఏర్పాటు చేయడంలో జాప్యం చేస్తున్నారన్నారు. సింగరేణి యాజమాన్యం, తప్పుడు నివేదికలతో కలుషిత నీరు తాగొచ్చని చెబుతున్నారన్నారు. కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సింగరేణి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. రామగుండం, బెల్లంపల్లి రీజియన్ కార్మికులకు రాపిడ్ గ్రావిటీ ఫిల్టరైజేషన్ ద్వారా తాగునీరు అందించేందుకు యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి తాగునీరందించేందుకు ఒప్పందం చేసుకున్నారన్నారు. సింగరేణి కార్మికులకు మిషన్ భగీరథ ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఇతర ప్రాంతాలకు తాగునీరందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వై.సారంగపాణి, ఆకుల హరిణ్, సాయవేణి సతీశ్, మాదాసు రవీందర్, పల్లె శ్రీనివాస్, పోరండ్ల వెంకటేశం, ఎల్లావుల కోటయ్య, పెంచాల వెంకటస్వామి, సంగాని సాంబయ్య, పోతరాజు భాస్కర్, నీలం శ్రీనివాస్, ఆరెపల్లి వెంకటరాజం, బిమునిపెల్లి నారాయణ పాల్గొన్నారు.

భారతీయ రైల్వేకు 170 ఏళ్లు!

రామగుండం: భారతీయ రైల్వేకు ఆదివారం నాటికి 170 ఏళ్లు నిండింది. భారతదేశంలో 16 ఫిబ్రవరి 1853లో ముంబాయి–థానే మధ్య (21 మైళ్ళు) 34 కిలోమీటర్ల దూరం 45 నిమిషాల్లో బోరీబందర్ అనే రైల్వేస్టేషన్ వరకు మొదటి రైలునడిచింది. 14 బోగీలతో 400 మంది ప్యాసింజర్లను గమ్యస్థానానికి చేర్చిన మొదటి రైలు పట్టాలపై ప్రయాణించింది. నిజాం కాలం నాటి హయంలోనే రైలుమార్గం ప్రారంభమైంది. ఆ సమయంలో బొగ్గు ఆధారిత ఆవిరితో నడిపించే ఇంజిన్లతో రైళ్లను నడిపించారు. కాగా ప్రపంచంలో 21 ఫిబ్రవరి 1804లో రైలు మార్గం ప్రారంభమైంది. ఆ సమయంలో నిజాం కాలం నాటి ఇంజినీర్లు మూడురకాల ఆవిరి ఇంజిన్లను తయారుచేశారు. వాటికి సుల్తానా, సింధ్, సాహెబ్ అనే పేర్లు పెట్టారు. రైలుమార్గానికి వినియోగించిన ఇనుము సామగ్రిని ఒడిశా రాష్ట్రంలోని రూర్కెలాలో రైలు బోగీల తయారీకేంద్రం ఏర్పాటుచేశారు.

ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించిన ఆర్జీ1జీఎం

- సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ ఆదేశం



ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్ శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణి కార్మిక వాడలకు సురక్షిత మంచినీరందించాలని డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ ఆదేశించారు. ఆదివారం ఆర్జీ–1 ఏరియాలోని ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించారు. జీఎం చింతల శ్రీనివాస్‌తో కలిసి గంగానగర్ వద్దనున్న 1 మిలియన్ గ్యాలన్ల సామర్థ్యం గల ఫిల్టర్‌బెడ్‌ను తనిఖీచేశారు. ఫిల్టర్ బెడ్‌లోని ఇసుకను మార్చాలన్నారు. ఫిల్టర్ బెడ్‌లను పూర్తిస్థాయిలో శుభ్రంచేసి కాలనీలకు సురక్షిత నీరు సరఫరా చేసేలా చూడాలన్నారు. కార్మిక వాడలకు సురక్షిత నీరందించే విషయంపై శాశ్వత ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఇటీవల నిధులు మంజూరైన రాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ల నిర్మాణానికి స్థలాన్ని డైరెక్టర్ పరిశీలించారు. అనంతరం జీడీకే–5 ఓసీపీ సందర్శించి ఉత్పత్తి, ఉత్పాదకత తీరును వ్యూ పాయింట్ ద్వారా పరిశీలించారు. డైరెక్టర్ వెంట జీడీకే–5 ఓసీపీ ప్రాజెక్ట్ అధికారి చంద్రశేఖర్, డీవైఎస్ఈ వసంత్‌కుమార్, సివిల్ ఇంజినీర్ వెంకటేశ్వర్‌రావు, సెక్యూరిటీఅధికారి వీరారెడ్డి తదితరులున్నారు.